ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
సోమవారం 29 సెప్టెంబరు 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 27.0 । కనిష్ఠం : 23.0



అభివృద్ధిలో కొండారెడ్డిపల్లి ఆదర్శం కావాలి

- మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి
- ముఖ్యమంత్రి స్వగ్రామంలో రూ.134 కోట్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



కొండారెడ్డిపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి తదితరులు

కల్వకుర్తి/వంగూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్ స్థానిక హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో రూ.134 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

(మిగతా 6వ పేజీలో..)

పులిబిడ్డవైతే పాలమూరును పూర్తి చెయ్

- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్
- రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కేఎల్ఐ చివరి ఆయకట్టుకు నీరందడం లేదు
- అచ్చంపేటకు ఆమోదయోగ్యమైన నాయకత్వాన్ని అందిస్తాం
- విజయవంతమైన జనగర్జన సభ



అచ్చంపేట పట్టణంలో జనగర్జన ర్యాలీలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు, ప్రజలు



సభలో మాట్లాడుతున్న కేటీఆర్

నాగర్‌కర్నూల్/అచ్చంపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లమల పులిబిడ్డవైతే పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీజేపీలో చేరిన తర్వాత ఆదివారం అచ్చంపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జనగర్జన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులపై నిబద్ధత ఉన్నందుకే కేసీఆర్ హయాంలో కేఎల్ఐ కింద దాదాపు 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించగలుగుతున్నామనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గమనించాలని సూచించారు. ఈ సభకు కేటీఆర్‌తో సహా మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, జైపాల్ యాదవ్‌లు హాజరయ్యారు. బహిరంగ సభలో కేటీఆర్ బీజేపీ, కాంగ్రెస్‌లపై విరుచుకుపడ్డారు. తమ పార్టీ హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్మించిన ప్రాజెక్టుల గురించి ప్రధానంగా ప్రస్తావించే ప్రయత్నాలు చేశారు. ఆర్డీఎస్ విషయంలో జిల్లా రైతాంగానికి జరుగుతున్న అన్యాయంపై 2001లో కేసీఆర్ పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలోనే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద దాదాపు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రయత్నం జరిగిందని అన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో 90వేల ఎకరాలకు సాగునీరందించే ప్రయత్నం చేస్తూనే అచ్చంపేట లిఫ్టు ఇరిగేషన్ ద్వారా మరో 15వేల ఎకరాలకు సాగునీరందించేందుకు రూ.1,350 కోట్లు మంజూరు చేసిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే ఎల్లూరు నుంచి ఏదుల వరకు

(మిగతా 6వ పేజీలో..)

మహబూబ్‌నగర్‌కు నిజాముద్దీన్ మృతదేహం

- అమెరికాలో పోలీసు కాల్పుల్లో చనిపోయిన 25 రోజుల తర్వాత స్వగ్రామానికి..



నిజాముద్దీన్ మృతదేహం

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో అక్కడి పోలీసుల కాల్పుల్లో మరణించిన నిజాముద్దీన్ మృతదేహం ఎట్టకేలకు స్వదేశానికి చేరుకుంది. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాగా, అక్కడి నుంచి కుటుంబ సభ్యులు ఉదయం 8 గంటలకు మహబూబ్‌నగర్‌లోని టీకే రెడ్డికాలనీలోని స్వగృహానికి తెచ్చారు. ఈనెల 3న శాన్‌ఫ్రాన్సిస్కోలో పోలీసులు జరిపిన కాల్పుల్లో నిజాముద్దీన్ మరణించాడు. మృతదేహాన్ని చూడగానే కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. శరీరంలో నాలుగు బుల్లెట్లు దిగినట్లు వారు చెప్పారు. కు టుంబ సభ్యులు, బంధువుల పరామర్శ అనంతరం మధ్యాహ్నం జామే మసీదుకు మృతదేహాన్ని తరలించారు. అక్కడ నమాజ్ చేసిన అనంతరం రామయ్యబౌళిలోని కబ్రస్థాన్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. మాజీమంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎంఐఎం ఎమ్మెల్సీ రహ్మద్‌బేగ్ మృతదేహాన్ని శంషాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు తెచ్చే వరకు వెంటనే ఉన్నారు. అంత్యక్రియలు పూర్తయ్యేవరకు దగ్గరుండి పర్యవేక్షించారు. కాగా ఘటన జరిగిన 25 రోజుల తరువాత అంత్యక్రియలు నిర్వహించారు.

మహాలక్ష్మి దేవిగా అమ్మవారు



దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాలమూరులోని బ్రాహ్మణవాడిలో గల వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ఏడో రోజు ఆదివారం మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రూ.7,7,77,777.77లతో అమ్మవారిని అలంకరించారు.

- మహబూబ్‌నగర్ న్యూటౌన్, (ఆంధ్రజ్యోతి)

ఫుట్‌బాల్ చాంపియన్ వనపర్తి

- రాష్ట్ర స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో విజయం
- రన్నర్‌గా కరీంనగర్
- మూడో స్థానంలో మహబూబ్‌నగర్, గద్వాల జట్లు



విజేత వనపర్తి జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా వనపర్తి జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వనపర్తి జట్టు కరీంనగర్‌పై గెలిచింది. రన్నర్‌గా కరీంనగర్, మూడో స్థానంలో మహబూబ్‌నగర్, గద్వాల జట్లు నిలిచాయి.

క్రీడల హబ్‌గా మహబూబ్‌నగర్: యెన్నం

మహబూబ్‌నగర్‌ను క్రీడల హబ్‌గా తీర్చిదిద్దుతామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఇండోర్ స్టేడియంలో 11వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా స్టేడియం అభివృద్ధికి రూ.16 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి పాల్గుణ, ట్రెజరర్ గణపతి, జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌పీ వెంకటేశ్, భానుకిరణ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వరద

- భీమా, కృష్ణా నదుల ప్రవాహం ఉధృతం
- ఇళ్లు ఖాళీ చేస్తున్న కృష్ణ మండలం వాసునగర్ కాలనీవాసులు
- నది పరివాహక ప్రాంతంలో నీట మునిగిన వరి పంట

7



వాసునగర్‌లో నీట మునిగిన షెడ్లు

జగజ్జననీ సదాస్మరామి

● ఏడో రోజు వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు

దసరా నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లు శనివారం ఏడో రోజు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అలంపూర్‌లో జోగుళాంబ అమ్మవారు కాళరాత్రి దేవిగా పూజలందుకున్నారు. జడ్చర్లలో మధుర మీనాక్షిగా, అచ్చంపేటలో రాజరాజేశ్వరి అలంకరణలో కనిపించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


అలంపూర్‌లో కాళరాత్రీ దేవి అలంకరణలో దర్శనమిస్తున్న జోగుళాంబ అమ్మవారు


అచ్చంపేటలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో..


నారాయణపేటలోని శక్తిపీఠంలో మహాలక్ష్మీ దేవిగా అమ్మవారు


జడ్చర్ల పట్టణంలోని వాసవీ కన్యకపరమేశ్వరీ ఆలయంలో మధురమీనాక్షిగా దర్శనమిస్తున్న అమ్మవారు


నారాయణపేట మండలం సింగారంలో మహాచండీ దేవి అలంకరణలో అమ్మవారు..


వనపర్తి జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో గాయత్రి దేవిగా దర్శనం..

ఖాళీ బిందెలతో మహిళల ధర్నా


జడ్చర్ల మండలం చిన్నఆదిరాల పంచాయతీ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న గ్రామస్థులు

జడ్చర్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మంచి నీటిని సరఫరా చేయాలంటూ మండలంలోని చిన్నఆదిరాల గ్రామంలో ఖాళీ బిందెలతో మహిళలు, గ్రామస్థులు ఆదివారం ధర్నా చేపట్టారు. మంచినీటి సరఫరా లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని, వెంటనే నీటిని వదిలే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామంలో రెండు బోరు మోటార్లు ఉన్నాయని, ప్రస్తుతం ఒక బోరు మోటరుతో గ్రామంలో నీళ్లు అందిస్తున్నామని గ్రామ పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. గ్రామంలో ఓ కాలనీకి సరఫరా అయ్యే బోరు మోటరు ప్రస్తుతం రిపేర్‌లో ఉన్న కారణంగా కొంత ఇబ్బంది ఏర్పడిందని, జడ్చర్లలో మిషన్‌భగీరథ పైపు లైను పగిలిపోవడంతో నీరు సరఫరా కాలేదన్నారు. మరమ్మతు చేపట్టి నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ బాలనగర్‌లో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులను ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి కె.సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాటరింగ్ అసిస్టెంట్ -1, టీజీటీ మ్యూజికల్ టీచర్-1, పీఈటీ (మహిళ)-1, స్వీపర్, స్కావెంజర్-1, హాస్టల్ వార్డెన్ పురుషులు-1, మహిళలు-1, గార్డినర్-1 పోస్టుల కోసం అక్టోబరు 8 సాయంత్రం 4 గంటల వరకు అవకాశం ఉందని తెలిపారు. అభ్యర్థులను అర్హత మార్కుల ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు, బతుకమ్మను ఎత్తుకున్న చిన్నారి

ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ

● మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబురాలు


బతుకమ్మ ఆడుతున్న వివిధ శాఖల మహిళా ఉద్యోగులు, చిన్నారులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ ఆవరణలో ఆదివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మెప్మా, డీఆర్డీవో, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్మర్మేషన్, ఇంజనీర్, అగ్నిమాపక శాఖ, ఎస్సీ కార్పొరేషన్ శాఖల మహిళ ఉద్యోగులు, కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ ఆడారు. మహిళలకు కలెక్టర్ విజయేందిర బోయి శుభాకాంక్షలు తెలిపారు. డీపీఆర్వో శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్మర్మేషన్ ఇంజనీర్ ఇస్రానాయక్ పాల్గొన్నారు. అదే విధంగా నగర పరిధిలోని ఎదిర 4వ వార్డులో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు బతుకమ్మ, కోలాటం ఆడారు.


ఎదిరలో బతుకమ్మలతో మహిళలు

అదనపు చార్జీలకు నిరసనగా

టీడీపీ రాస్తారోకో


మహబూబ్‌నగర్‌లో రాస్తారోకో చేస్తున్న టీడీపీ నాయకులు

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హిందువుల పర్వదినాలకు, జాతరలకు ప్రత్యేక బస్సుల పేరుతో ఆర్టీసీ యాజమాన్యం అదనపు చార్జీలు వసూలుకు నిరసనగా ఆదివారం టీడీపీ నాయకులు మహబూబ్‌నగర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా పండుగకు స్పెషల్ బస్సులు నడిపిస్తూ తెలంగాణ ఆర్టీసీ ప్రతీ బస్సుకు స్పెషల్ సర్వీస్ బోర్డ్ అని డబుల్ రేట్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రెగ్యులర్ సర్వీసులకు ఒక పేపర్‌పై స్పెషల్ బస్సు అని అతికించి సర్వీస్‌లో నడిపిస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి జి ల్లాలో మొత్తం బస్సులు 900 ఉన్నాయని, అందులో రెగ్యులర్‌గా 700 నుంచి 800 వ రకు నడిపిస్తారని, ఇవికాక అడిషనల్‌గా వేసే బస్సు సర్వీసులకు మాత్రమే స్పెషల్ బోర్డులు పెట్టాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పార్లమెంటరీ టీడీపీ సభ్యుడు సాయన్నగౌడ్, మురళి, తిరుపతయ్య పాల్గొన్నారు.

జిల్లా సదస్సును జయప్రదం చేయాలి

నారాయణపేట టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మంగళవారం మెట్రో ఫంక్షన్ హాల్‌లో నిర్వమించే సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సదస్సు జయప్రదం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం కోటకొండ, అంభగపూర్‌లో సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులపై చూపెడుతున్న వివక్ష, వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు, హాజీ మలంగ్, ప్రతాప్, సలీం, ఇస్మాయిల్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో కొండారెడ్డిపల్లి ఆదర్శం కావాలి


పాలశీతలీకరణ కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

(5వ పేజీ తరువాయి..)

చేశారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ్మ మాట్లాడుతూ కొండారెడ్డిపల్లి 514 నివాస గృహాలు ఉన్నాయని తెలిపారు. రూ.10.53 కోట్లతో 480 ఇళ్లకు 6 సోలర్ ప్యానళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నెలకు 360 యూనిట్ల విద్యుత్ సరఫరా అవుతోందని, అవసరాలకు పోను మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేయడంతో యూనిట్‌కు రూ.5.25 చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకుందన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. కొండారెడ్డిపల్లిలో రూ.2.50 కోట్లతో బీఎంసీయూ నిర్మాణంతో 30 వేల లీటర్ల పాల సేకరణ జరగనుందన్నారు. భవనాలతో పాటు ఏటీసీ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం అభినందనీయమన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు మహిళలతో బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ, రైతు కమీషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, గ్రామాభివృద్ధి చైర్మన్ ఎనుముల కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

పట్టణంలో 100 శాతం సీసీ రోడ్ల ఏర్పాటుకు కృషి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో వంద శాతం సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృ ష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని 9, 10, 11, 12, 14, 17, 19 వార్డుల్లో రూ.30కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు గ్రంథాలయ జిల్లా చైర్మన్ రాజేందర్, మునిసిపల్ చైర్మన్ శ్రీని వాసులు, కౌన్సిలర్ సునీతాశ్రీని వాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ త్వరలోనే పనులు ప్రారంభించి పట్టణంలోని ప్రతీ వార్డులో సీసీరోడ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించి ప్రజాపా లనలో భాగస్వాములు కావాలన్నారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో అచ్చంపేటను అన్ని విధాలా అభివృద్ధి పరుస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పులిబిడ్డవైతే పాలమూరును పూర్తి చెయ్

(5వ పేజీ తరువాయి..)

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం రిజర్వాయర్ల నిర్మాణం పూ ర్తైందని అన్నారు. కేసీఆర్ ముఖ్య మంత్రిగా ఉన్న కాలంలోనే ఒక మో టారును కూడా ప్రారంభించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో రెండు సంవత్సరాల కాలంలో అక్కడ జరిగిన పురోగతి ఏమిటో తెలియ జేయాలని సవాల్ చేశారు. అప్పట్లోనే 90శాతం పనులు పూర్తైన మరో 10శాతం పనులను పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు సాహసించడం లేదో స్పష్టం చేయాలన్నారు. అచ్చంపేట నియోజకవర్గం రాజకీయ చైతన్యం, తెగువకు పెట్టింది పేరు అని కేటీఆర్ కొనియా డారు. అచ్చంపేట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఒకరు పార్టీని వీడడం తన విజ్ఞతకే వదిలేస్తున్నా మని కేటీఆర్ అన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌లో క్రి యాశీలకంగా పని చేస్తున్న అందరి అభిప్రాయాలను తీసుకుని త్వరలోనే కొత్త నాయకత్వాన్ని అందిస్తామని ఆయన భరోసానిచ్చారు.


సభలో మాట్లాడుతున్న కేటీఆర్



బీఆర్‌ఎస్ పార్టీ నీకు ఏమి తక్కువ చేసింది : మర్రి

బీఆర్‌ఎస్ పార్టీ నీకు ఏమి తక్కువ చేసిందని నీవు పార్టీని వీడావని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి గువ్వలను ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల వారిని మోసం చేస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను సోషల్ మీడియాలో పోస్టు చేసే బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కేసు నమోదు చేయిస్తున్నారని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఎమ్మె ల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, రజిని సాయి చంద్, ఉప్పుల వెంకటేష్, పోకల మనోహర్, మునిసిపల్ మాజీ చైర్మన్ నరసింహ్మగౌడ్ తదితరులు ఉన్నారు.

మంద సురేఖకు సాహితీ కిరీటి పురస్కారం

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్‌కు చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ప్రముఖ కవయిత్రి డాక్టర్ మంద సురేఖ శ్రీశ్రీ కళా వేదిక సాహితీ కిరీటి పురస్కారం పొందారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో శ్రీశ్రీ కళా వేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్, ప్రపంచ తెలుగు, సంస్కృతి కళా వేదిక, తెలుగు రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో అవార్డు ప్రదానోత్సవం నిర్వహించారు. నిర్వాహకులు శ్రీశ్రీ కళా వేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, మేనేజింగ్ డైరెక్టర్ కత్తిమండ ప్రతాప్‌కుమార్‌లతో పాటు నాళేశ్వరం శంకరం, కావూరి శ్రీనివాస్‌శర్మ, గరిమెళ్ల రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును స్వీకరించారు. ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. అవార్డు గ్రహీత డాక్టర్ మంద సురేఖ మాట్లాడుతూ తెలుగు భాషా సంస్కృతి, వైభవం, సాహిత్యం, కళలు పరిరక్షణ కోసం పని చేస్తున్న శ్రీశ్రీ కళా వేదిక తెలుగు సాహిత్యానికి తాను చేస్తున్న కృషికి సాహితీ కిరీటి పరస్కారాన్ని ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ పురస్కారంతో తెలుగు సాహిత్య అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఆమె తెలిపారు. మంద సురేఖకు అవార్డు లభించడం పట్ల జిల్లాలోని కవులు, సాహితీ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.


హైదరాబాద్‌లో నిర్వాహకుల నుంచి పురస్కారం స్వీకరిస్తున్న డాక్టర్ మంద సురేఖ

అపూర్వం.. ఆత్మీయం

- ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని సాతాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994- 2015 బ్యాచ్ పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. సాతాపూర్ ఉన్నత పాఠశాలలో చదివిన 11బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై కలుసుకున్నారు. వారు ఒక సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను శాలువాలు కప్పి పూల మాలతో సన్మానించారు. విద్యార్థినీ విద్యార్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.


సాతాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో విద్యార్థులు, అధ్యాపకులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శాంతకుమార్

బీజేపీ కార్యకర్తలపై కేసులా?

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతకుమార్

ఆత్మకూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మాన్ని కాపాడుకునేందుకు హిందూ బంధువులందరూ కలిసి ఈ నెల 4న ఆత్మకూరు గాంధీ చౌరస్తాలో శాంతియుతంగా ధర్నా చేస్తుంటే ఆత్మకూరు పోలీసులు బీజేపీ నాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతకుమార్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆత్మకూరు సీఐ కార్యాలయాన్ని సందర్శించిన సీఐ శివకుమార్‌తో మాట్లాడారు. అక్రమ కేసులు పెట్టడం సరైంది కాదని ప్రశ్నించారు. హిందూ ధర్మాన్ని కాపాడుకునేందుకు ఆయా పార్టీల నాయకులతో పాటు బీజేపీ నాయకులు కూడా శాంతియుతంగా ధర్నా చేస్తుంటే కేవలం బీజేపీ నాయకులపై కేసులు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. బీజేపీ నాయకులపై కేసులు నమోదు చేయడంలో పోలీసులు అత్యుత్సాహం చూపడం సరైంది కాదన్నారు. ఇరు వర్గాల మధ్య శాంతియుత వాతావరణం నెలకొల్పే విధంగా పోలీసులు చొరవ తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఆత్మకూరు ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఓ వర్గానికి సంబంధించిన జెండాలు తొలగించాలని హిందూ బంధువులు శాంతియుతంగా ధర్నా చేస్తే వారిపై నాన్‌బెయిలబుల్ సెక్షన్ కింద కేసులు నమోదు చేయడం తగదన్నారు. అనంతరం బీజేపీ కార్యకర్తలకు మనోధైర్యాన్నిస్తూ బీజేపీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని, ఎలాంటి అధైర్యానికి లోను కావొద్దని భరోసా ఇచ్చారు. అశోక్ భూపాల్, మంగ లావణ్య, ఆనంద్, ఆంజనేయులు, మనోహర్ గౌడ్, తమ్మలి విజయ్, ప్రధాన కార్యదర్శులు ఎల్లన్న, రాఘవేందర్, నాయకులు అరవింద్, రాఘవేందర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

గోపాల్‌పేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గుర్తు తెలియని ఆటో ఢీ కొని ఓ వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి. మండలంలోని పొలికేపాడ్ గ్రామానికి చెందిన బాలపీర్ ఆదివారం రాత్రి పని నిమిత్తం గోపాల్‌పేట మండల కేంద్రానికి వచ్చి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బైక్‌పై వెళ్తుండగా.. గుర్తు తెలియని ఆటో వనపర్తి నుంచి గోపాల్‌పేట వైపు వెళ్తూ.. వేగంతో బాలపీర్‌ను ఢీ కొట్టి వెళ్లిపోయింది. దీంతో బాలపీర్ కాలువిరిగి తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారి కుంటుబ సభ్యులకు, 108కు సమాచారం అందించారు. సంఘటన జరిగి గంట సమయం కావొస్తున్నా.. అంబులెన్స్ రాకపోవాడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. రోడ్డుపై కూర్చున్నారు. ఎస్ఐ నరేష్‌కుమార్ సంఘటన చేరుకొని వారిని శాంతిపజేసి బాలపీర్‌ను అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆసు పత్రికి తరలించారు.

శాంతించని దుందుభీ



మేడిపూర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ నది

తాడూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దుందుభీ నది ఉధృతి ఆదివారం సైతం ఏమాత్రం తగ్గలేదు. దుందుభీ నది ప్రవాహం ఏమాత్రం శాంతించక పోవడంతో నది పరివాహక ప్రాంత ప్రజలను స్థానిక పోలీసులు, మండల పరిషత్ సిబ్బంది అప్రమత్తం చేశారు. ఎవరూ దుందుభీ నది దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు. ఎగువన కురిసిన భారీ వర్షాల కారణంగా దుందుభీ నది ప్రవాహం ఉధృతంగా కొనసాగుతున్నది.

కోయిలల్‌సాగర్ 5 గేట్లు ఎత్తివేత

దేవరకద్ర, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలోని మధ్యతరహ అయిన కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నిండి నిండుకుండలా తలపిస్తున్నది. దీంతో ప్రాజెక్టు అధికారులు 5 గేట్లను ఎత్తి నీటిని కిందికి వదిలారు. ఆదివారం సాయంత్రం నాటికి ప్రాజెక్టు నీటి మట్టం 32.5 అడుగుల వద్ద నీటితో కళకళలాడుతోంది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు 13 షెట్టర్లు ఉండగా 5 షెట్టర్ల ద్వారా నీటిని విడుదల చేయడంతో 3500 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుందని నీటి పారుదల ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు.

కొనసాగుతున్న 'సంగంబండ' నుంచి నీటి విడుదల

మక్తల్‌రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని సంగం బండ జలాశయం ఒక గేటు ఎత్తి అధికారులు నీటిని విడుదల కొనసాగించారు. ఎగువ నుంచి పెద్ద వాగుకు వరద నీటి ఉధృతి కొంత తగ్గడంతో ఆదివారం ఒక గేటు మూసి ఒక గేటుతో దిగువకు నీటి విడుదల కొనసాగింది. జలాశయంలోకి 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 500 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉందని, రిజర్వాయర్ నీటి పూర్తి సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.63 టీఎంసీలు ఉందని ఇరిగేషన్ డీఈఈ సురేష్ తెలిపారు.



కొండపై నుంచి జారిపడ్డ కొండచరియలు

విరిగిపడిన కొండ చరియలు

అచ్చంపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉమామహేశ్వర కొండపై నీటిధారలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో శనివారం రాత్రి కొండపై నుంచి కొండ చరియలు జారిపడడంతో నాగదేవతల సమీపంలోని సపోర్టు వాల్ మొత్తం ధ్వంసమయ్యాయి. ఎప్పుడు ఏ రాయి వచ్చి మీద పడుతుందోనని ఆందోళనలో అర్చకులు, సిబ్బంది, భక్తులున్నారు. పాపానాశనం వరకు ఎవరినీ పోనివ్వకుండా భారీ కేట్లను ఏర్పాటు చేశారు. వర్షాలు పూర్తిగా తగ్గే వరకు స్వామి దర్శనం కోసం రాకపోతే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఘాట్ రోడ్డులో సైతం రాళ్లు రోడ్డుపై జారీ పడుతున్నాయి.

కేఎల్ఐ కాలువకు గండి



వృథాగా పోతున్న కేఎల్ఐ సాగునీరు

వెల్దండ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వెల్దండ మండల పరిధిలోని పోతేపల్లి శివారులో శనివారం రాత్రి కేఎల్ఐ డీ 82 కాలువకు గండిపడింది. దీంతో సాగునీరు పెద్దఎత్తున వృథాగా పోతుంది. సమీపంలోని పలువురు రైతులకు చెందిన వరి, మొక్కజొన్న, పత్తిపంటలు నీట మునిగాయి. కాగా గత నెలలో డీ 82 కాలువకు వెల్దండ సమీపంలో లక్ష్మాపురం వద్ద గండిపడింది. దీంతో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సంబంధిత ఇరిగేషన్ అధికారులు స్పందించారు. కాలువ మరమ్మతు పనులు చేపట్టి సాగునీటిని పునరుద్ధరించారు. కాగా, పది రోజులు కాకముందే తిరిగి పోతేపల్లి వద్ద కాలువకు గండిపడడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాలువను ఇరిగేషన్ డీఈ దేవన్న, నరేందర్‌రెడ్డి, ఏఈలు ప్రభాకర్, మాల్యా పరిశీలించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన రామస్వామి

మిడ్జిల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మిడ్జిల్ మండల కేంద్రంలోని ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రంగా గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని వెలుగొమ్ముల గ్రామానికి చెందిన బుద్దారం రామస్వామి మిడ్జిల్ గ్రామానికి పనినిమిత్తం వచ్చి వెలిజాలకు వెళ్లే రోడ్డు వైపు వెళుతూ రోడ్డు దాటుతుండగా బొలెరో వాహనం ఢీకొనడంతో రామస్వామి తలకు తీవ్రంగా గాయాలైనట్లు తెలిపారు. గాయపడిన రామస్వామిని చికిత్సకై వెంటనే జడ్చర్ల ప్రభుత్వ అస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ ఉస్మానియా అస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

చిన్నంబావి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదివారం విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైంది. చిన్నబావి మండల పరిధిలోని లక్ష్మీపల్లి గ్రామంలో మేకల శేకర్ యాదవ్ ఇల్లు షార్ట్ సర్క్యూట్ తో దగ్ధం కాగా, విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇంటి సామగ్రి పూర్తిగా దగ్ధమైందని, ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని తహసీల్దార్‌తో ఫోన్లో మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయ్యంగారి ప్రభాకర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

సమీప బంధువు అంత్యక్రియలకు వెళ్లి అనంతలోకాలకు..

- ఒకే రోజు ఇద్దరి ఆకస్మిక మృతితో మూసాపేటలో విషాదం

మూసాపేట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమీప బంధువుకు సంబంధించిన అంత్యక్రియలకు వెళ్లి అంత్యక్రియలు పూర్తికాకముందే అస్వస్థతకు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మూసాపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు.. మండలకేంద్రానికి చెందిన జింకలి మాసన్న(65) గత కొంతకాలం నుంచి అనారోగ్యానికి గురై ఈ మధ్యకాలంలో కోలుకుంటుండగా, ఆదివారం ఆకస్మికంగా మృతి చెందాడు. గ్రామంలో ఇతని అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లను గ్రామంలోని సమీప బంధువు బడవెంకటన్న(60) చేస్తున్నాడు. అంత్యక్రియలకు హాజరుకావడానికి వెళ్లి అక్కడ అస్వస్థతకు గురికావడంతో మూసాపేటలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి జానంపేట పీహెచ్‌సీలో చికిత్స చేశారు. పరిస్థితి విషమించడంతో జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. ఒకే గ్రామంలో ఇద్దరు సమీప బంధువులు ఆకస్మికంగా మృతి చెందడంతో ఇరు కుటుంబాలతో పాటు గ్రామంలో విషాదం అలుముకుంది.

ముంచెత్తిన వరద



ఖాళీ చేసేందుకు ట్రాక్టర్‌లో ఎక్కిస్తున్న సామగ్రి

- భీమా, కృష్ణా నదుల ప్రవాహం ఉధృతం
- ఇళ్లు ఖాళీ చేస్తున్న వాసునగర్ కాలనీ వాసులు
- కృష్ణ మండలం నదీ పరివాహక ప్రాంతంలో నీట మునిగిన వరి
- వరద నీటిలో 750 ఎకరాలు

నారాయణపేట/కృష్ణ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కృష్ణ, భీమా నదులు ఉధృతంగా పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఎగువ కర్ణాటక, మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నారాయణపూర్, ఆల్మట్టి, కోయినా, సన్నతి ప్రాజెక్టుల నుంచి దిగువన ఉన్న కృష్ణ, భీమా నదులకు ఎగువ నుంచి 5.20 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేయడంతో ఆదివారం నదులు ఉగ్రరూపంగా మారాయి.

కృష్ణ, భీమా నదుల పరివాహక ప్రాంతాలైన సుకర్‌లింగంపల్లి, కుసుమూర్తి, హళ్లహళ్లి, గుర్జుల, హిందూపూర్, గుడేబల్లూర్, ముడుమాల్ తదితర గ్రామ శివారులోని వరి పంట పొలాలలో వరద నీరు చేరి 185 మంది రైతులకు సంబంధించి దాదాపు 750 ఎకరాలు వరిపంట వరదనీరు చేరి మునిగిపోయింది. మునిగిన వరి పంటలకు సంబంధించి మండల వ్యవసాయఅధికారి సుదర్శన్‌గౌడ్ ప్రాథమిక అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు.

కృష్ణ మండల కేంద్రంలోని పుష్కర ఘాట్‌లు, కృష్ణవేణి విగ్రహం, పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మునిగి దత్తభీమేశ్వర దే వాలయానికి వరదనీరు తాకింది. హిందూ పూర్ గ్రామ శివారులోని గుర్రపు వాగుకు కృష్ణ, భీమా వరద నీరు ఎదురెక్కడంతో హిందూపూర్‌గ్రామ దళితవాడకు సమీ పంలో వరద నీరు చేరుకుంది. కాగా గుడేబల్లూర్ గ్రామ శివారులోని వాసునగర్ వద్ద లక్ష్మీ వేంకటేశ్వర ఎత్తిపోతల పథకం, పుష్కర ఘాట్‌లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, స్తంభాలతో పాటు నూతన బస్సు వంతెన నిర్మాణ పనులు నిర్వహించే కార్మికుల షెడ్లలో వరద నీరు చేరింది. దీంతో ముందుజాగ్రత్త పడి ఇటాచీ, ఎక్స్‌కవేటర్‌లతో ఒడ్డున చేరారు. వాసునగర్ నుంచి ట్రాక్టర్‌లలో సామగ్రి ఇతర ప్రాంతాలకు తరలించారు. ముడు మాల్ గ్రామ శివారులోని యాదవేంద్ర స్వామి దేవాలయం, పుష్కరఘాట్‌లలో వరద నీరు చేరడంతో మండల తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారులు, మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్, ఏఈఓ అభిలాష్, ఎస్ఐ నవీద్ ఆదివారం కృష్ణ నదిపరివాహక ప్రాంతాలను సందర్శించి ఆయా గ్రామ ప్రజలు, రైతులు కృష్ణ, భీమా నదిలో వెళ్లకుండా ఉండాలని గ్రామాల్లో చాటింపు వేయించామని మండల తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.



నీట మునిగిన వరి చేలు

కృష్ణా, భీమా వరద నీటి ఉధృతికి భారీ మొసళ్లు సంచరిస్తుండడం వల్ల నది పరివాహక గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఉధృతంగా కృష్ణానది

● సురక్షిత ప్రాంతానికి పుష్కరఘాట్ వాసులు

ఎర్రవల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తూ వరదనీరు పైకి చేరింది. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నీరు అధికంగా రావడంతో బీచుపల్లి దగ్గర శివాలయానికి తాకి రామాలయానికి అతి సమీపంలో వరద నీరు పారుతున్నది. దీంతో పిండ ప్రదానాల షెడ్లు, శివాలయం నీట మునిగింది. నది ఒడ్డున ఉన్న దుకాణదారులు, హోటళ్లు జీవనం సాగిస్తున్న పలు కుటుంబాలు నీరు మరింత పెరిగే అవకాశం ఉండటం వారిని వరద నీరు చుట్టుముట్టడంతో ముందస్తు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు సామగ్రిని తరలించుకున్నారు.



కృష్ణానది వరద పైకి చేరడంతో సురక్షిత ప్రాంతాలకు సామగ్రిని తరలిస్తున్న పలు దుకాణదారులు

జోగళాంబ సన్నిధిలో ఎంపీ ప్రత్యేక పూజలు

అలంపూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదో శక్తిపీఠమైన జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వార్లను హైదరాబాద్ ఎంపీ మందడి అనిల్ కుమార్ యాదవ్ సతీ సమేతంగా ఆదివారం దర్శించుకుని, అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఈవో దీప్తి రెడ్డి, ధర్మకర్తలు సాదర స్వాగతం పలికి స్వామి వారి ఆలయంలో గణపతి పూజ, అభిషేకాలు, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు చేసి శాలువా పూలమాలలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు హరిత టూరిజం హోటల్ నందు కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. గద్వాల సంస్థాన్ వారసుడు కృష్ణా రాంభూపాల్, కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయంలో దర్శనం చేసుకుంటున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

కడుపు నొప్పితో వస్తే కాటికి పంపించారు



బాలిక మృతదేహం దగ్గర రోదిస్తున్న తల్లి శిరీష

- వైద్యం వికటించి ఐదేళ్ల బాలిక మృతి
- వైద్యుడి నిర్వాకంతో మృతి చెందిందని బంధువుల ఆందోళన

కొందరు కార్పొరేట్ ఆసుపత్రుల వైద్యులు కాసులకు కక్కుర్తితో ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. ఇటీవల కాలంలో పెబ్బేరులోని ప్రైవేట్ ఆసుపత్రులలో వైద్యం వికటించి మృతి చెందుతున్న సంఘటనలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. విషయా లను బయటికి పొక్కకుండా ఉండేందుకు మధ్యవర్తుల సమక్షంలో శవాలపై బేరసారా లు ఆడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పెబ్బేరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒక ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రికి కడుపు నొప్పితో వచ్చిన బాలిక వైద్యం వికటించి మృతి చెందింది. ఈ సంఘటన ఆదివారం తెల్ల వారుజామున వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీలోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తా సమీపంలో చోటు చేసుకుంది.

బాలిక కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకా రం... వీపనగండ్ల మండలం గోవర్ధనగిరి గ్రామంలోని దళిత కాలనీకి చెందిన రాముడు, శిరీష దంపతులకు సంగీత, రమ్య ఇద్దరు కూతుళ్లున్నారు. చిన్న కూతురు రమ్య(5)కు ఆకస్మాతుగా కడుపులో నొప్పి రావడంతో తల్లిదండ్రులు పెబ్బేరు మునిసిపాలిటీలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రి వైద్యుడు ఎలాంటి వైద్య పరీక్షలు చేయకుండానే బాలికకు రెండు ఇంజక్షన్లు ఇవ్వడంతో నోట్లోంచి నురుగును గమనించి వెంటనే ఎక్సరే తీసి మరో రెండు ఇంజక్షన్లు ఇచ్చాడు. అప్పటికి పరిస్తితి విషమించడంతో మహబూబ్ నగర్‌కు తీసుకువెళ్లండని వైద్యుడు పురమాయించి ప్రైవేట్ అంబులెన్స్ ద్వారా పంపించాడు. మహబూబ్ నగర్ ఆసుపత్రి వైద్యులు బాలికను పరిశీలించగా అప్పటికే మృతి చెందిందని వెల్లడించారు. వైద్యుడి నిర్లక్ష్యంతోనే బాలిక మృతి చెందిందని కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు.

మా దృష్టికి రాలేదు..

బాలిక మృతి చెందిన సంఘటన మా దృష్టికి రాలేదు. సోమవారం వైద్య బృదంతో కలిసి ఆసుపత్రిని సందర్శించి పరిశీలిస్తాం. బాలిక మృతికి కారణాలు, వైద్యుడు అందించిన చికిత్స, మందులు తదితర అంశాలను పరిశీలిస్తాం. వైద్యం వికటించి బాలిక మృతి చెందినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- అల్లే శ్రీనివాసులు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, వనపర్తి

● దళిత బాలిక ప్రాణం ఖరీదు రూ.2లక్షలు!

గత మార్చిలో మండలంలోని తిప్పాయిపల్లి గ్రామానికి చెందిన గర్భవతి కడుపు నొప్పితో వచ్చారు. 8నెలల గర్భవతికి గర్భం వైద్య పరీక్షలు చేయకుండానే ఆపరేషన్ చేయాలి, లేదంటే పెద్దప్రాణానికి ప్రమాదమని ఆసుపత్రి వైద్యుడు సూచించడంతో కుటుంబ సభ్యులు పూనుకున్నారు. 8 నెలల్లో ఆపరేషన్ చేసి తీసిన శిశువుకి దాదాపుగా 3 గంటల పాటు చికిత్స అందించారు. చివరికి శిశువు పరిస్థితి విషమించడంతో మహబూబ్ గనర్‌కు తీసుకువెళ్లండని వైద్యుడు ఉచిత సలహా ఇచ్చారు. దీంతో చేసేది ఏమిలేక కుటుంబ సభ్యులు శిశువుని మహబూబ్ నగర్‌కు తీసుకువెళ్లిన అక్కడి వైద్యులు రూ.లక్షలు పోసినా శిశువు ప్రాణాన్ని కాపాడలేమని చెప్పారు. హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో శిశువు మృతి చెందినట్లు ఆరోపణలు ఉన్నాయి.

బస్సు ఎక్కితే బహుమతులు

- దసరాకు లక్కీడ్రా నిర్వహణ
- ఈనెల 27 నుంచి అక్టోబరు 6 వరకు వర్తింపు

వనపర్తి రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ నేపథ్యంలో తమ బస్సుల్లో (డీలక్స్ సూపర్ లగ్జరీలో) ప్రయాణించే వారికి లక్కీ డ్రా నిర్వహించాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ఈ లక్కీ డ్రాలో గెలుపొందిన ముగ్గురికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తారు. ప్రథమ బహుమతి రూ.25000, ద్వితీయ బహుమతి రూ.15000, తృతీయ బహుమతి రూ.10,000 నగదును అందజేయనున్నారు. ఇందుకోసం ఆర్టీసీ ప్రత్యేకంగా అదనంగా కర్నూల్, కొత్తకోట, హైదరాబాద్‌లకు రూట్‌లకు పది బస్సులు ఏర్పాటు చేసింది. ఇంకా ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్లలో చౌరస్తాలలో ప్రత్యేక మానిటరింగ్ టీంల ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రయాణికులకు ఏర్పాట్లు చేశారు. ఈ స్పెషల్ ఆపరేషన్స్ 27వ తేదీ నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు కొనసాగుతుంది. ప్రయాణికులు సొంత గ్రామాలకు వెళ్లేటప్పుడు డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులలో ప్రయాణం చేసే ప్రయాణికులు బస్సు దిగిన తరువాత తీసుకున్న టికెట్ వెనుక భాగాన మీ పేరు ఫోన్ నెంబర్ రాసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లలో వేయాలి. 27వ తేదీ నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు ప్రయాణించిన వారికి ఈ యొక్క బంపర్ ఆఫర్ వర్తిస్తుంది. అక్టోబరు 8న మహబూబ్ నగర్ రీజినల్ కార్యాలయంలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఈ డ్రాప్ బాక్స్‌ను ఓపెన్ చేసి బహుమతులను ప్రకటిస్తారు.



వనపర్తి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన లక్కీ డ్రా బాక్స్

● బస్సుల్లో ప్రయాణించండి..

డీలక్స్, సూపర్ లగ్జరీలో ప్రయాణం చేసి బహుమతులు గెలుచుకోవాలి. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తే సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుతారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ప్రతీ బస్టాండ్‌లో మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేశాం.

- ఆర్టీసీ డీఎం దేవేందర్‌గౌడ్

మెరిశారు.. సాధించారు..

- గ్రూప్-1,2 ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన ఉమ్మడి జిల్లా వాసులు

గత ఏడాది నిర్వహించిన గ్రూప్ -1, 2 పరీక్షల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వాసులు ప్రతిభ చూపి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. వారిలో కష్టపడి చదివిన తీరుతో పాటు కొందరి మనోభావాలను 'ఆంధ్రజ్యోతి' సేకరించింది.

ఐఏఎస్ సాధించడమే లక్ష్యం...



కొత్తకోట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సివిల్‌లో ఐఏఎస్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నని గ్రూప్ వన్ ఫలితాల్లో 510 ర్యాంక్ సాధించి శనివారం డిప్యూటీ కలెక్టర్‌గా సీఎం రేవంత్‌రెడ్డిచే నియమాక పత్రాన్ని అందుకున్న మండ్ల పవన్ కుమార్ తెలిపారు. ఆదివారం పవన్ కుమార్ గ్రూప్-1 సాధించిన విజయంపై 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండల వడ్డెవాట గ్రామానికి చెందిన వెంకటస్వామి, పుష్పలత దంపతులు మొదటి కుమారుడు పవన్ కుమార్. తండ్రి పోలీస్ శాఖలో హెడ్ కానిస్టేబుల్, తల్లి గృహిణి.

గ్రూప్ - 2లో మెరిసిన గ్రామ కార్యదర్శి



వెల్దండ, (ఆంధ్రజ్యోతి): మాడ్గుల మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన వికాస్ ప్రస్తుతం మండలంలోని బైరాపూర్ గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. తాజాగా విడుదల చేసిన గ్రూప్ - 2 ఫలితాలలో 268 ర్యాంకు సాధించిన వికాస్ ఎక్సైజ్ ఎస్ఐగా ఉద్యోగం సాధించాడు. ఉన్నత ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివి మెరుగైన ర్యాంకు ద్వారా ఉద్యోగం సాధించినట్లు వికాస్ పేర్కొన్నాడు.

● అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా విజయ



వెల్దండ మండలంలోని అల్లంతోటబావితండాకు చెందిన రాత్లావత్ విజయ గ్రూప్ - 2 ఫలితాలలో జీఏడీలో(సాధారణ పరిపాలనా విభాగం)లో అసిస్టెంట్ సెక్షన్ అధికారిణిగా ఉద్యోగం సాధించారు. 2020లో ఫారెస్టరీ విభాగంలో బీఎస్సీ చదివిన విజయ గత డిసెంబర్‌లో నిర్వహించిన గ్రూప్ - 2 పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 1230 ర్యాంకు సాధించింది. కాగా 7వ జోన్‌లో ఎస్టీ క్యాటగిరీ మహిళా విభాగంలో విజయ మొదటి ర్యాంకు సాధించారు.

గ్రూప్-2కు ఎంపికైన తెలకపల్లి వాసి



నాగర్‌కర్నూల్ క్రైం, (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 ఫలితాల్లో తెలకపల్లికి చెందిన యువతి ఏఎస్‌వో పోస్టుకు సెలెక్ట్ అయింది. తెలకపల్లి పట్టణానికి చెందిన మాకం మోహన్, రజిత దంపతుల కుమార్తె మాకం వర్ష గ్రూప్-2కు సెలెక్ట్ అయింది. ప్రాథమిక హైస్కూల్‌లో విద్య తెలకపల్లిలోనే కొనసాగించిన ఈమె ఇంటర్, బీటెక్ హైదరాబాద్‌లో పూర్తి చేసింది. జనరల్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్‌లో ఏఎస్‌వోగా ఎంపిక అయింది.

ఒకే ఇంట్లో ఇద్దరు గ్రూప్-1 అధికారులు



అమ్మానాన్నలతో అరుణ్ కుమార్, స్వర్ణలత

నవాబ్‌పేట, (ఆంధ్రజ్యోతి): నవాబ్‌పేట మండలంలోని కొల్లూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సత్రోనిపల్లి తండాకు చెందిన విస్లావత్ చందర్ నాయక్, తారాబాయి దంపతుల కుమారుడు అరుణ్‌కుమార్, స్వర్ణలతలు గ్రూప్ 1 అధికారుల జాబితాలో డీఎస్పీగా అరుణ్‌కుమార్, మునిసిపల్ కమిషనర్‌గా స్వర్ణలత ఎంపికయ్యారు. ఈనెల 27న హైదరాబాద్‌లోని శిల్పకళామందిర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అర్హత పత్రాలు అందుకున్నారు. దీంతో గ్రామస్థులు పలువురు వారిని శాలువాలతో సన్మానించారు.

ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో...



అయిజ,(ఆంధ్రజ్యోతి): ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో పట్టుబట్టి ఉద్యోగం సాధించానని బింగిదొడ్డికి చెందిన వెంకటేశ్ తెలిపారు. తండ్రి చిన్న వెంకటేశ్ నాయీబ్రాహ్మణుడిగా వృత్తి పనిచేస్తూ చదివించారన్నారు.

అంకితభావంతో చదివాను



వివాహం అయ్యి బాబు ఉన్నప్పటికీ కష్టపడి అంకిత భావంతో చదివి విజయం సాధించానని జ్యోత్స్న తెలిపారు. మాది మల్దకల్ మండలం ఎల్కూరు గ్రామం. మా అమ్మ శ్యామల, నాన్న రత్నంలు రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. అయిజ మండలం చిన్నతాండ్రపాడు గ్రామానికి చెందిన రవితో 2020లో వివాహం జరిగింది. ప్రస్తుతం గ్రూపు-4 ఉద్యోగిగా నిజామాబాద్ జిల్లాలో ఉద్యోగం చేస్తున్న సమయంలో గ్రూప్-2 నందు విజయం సాధించా. ఢిల్లీ యూనివర్సిటీలో మ్యాథమటిక్స్ హనర్ పూర్తిచేశాను.

ఎక్సైజ్ ఎస్ఐగా రాజశేఖర్ రెడ్డి..



వడ్డేపల్లి,(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 ఫలితాల్లో జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం కోవెలదిన్నెవాసి రాజశేఖర్ రెడ్డి 283వ ర్యాంకు సాధించాడు. ఎక్సైజ్ ఎస్ఐగా ఎంపికకావడం పట్ల గ్రామస్థులు, తల్లిదండ్రులు వెంకటేశ్వరమ్మ, మల్లికార్జున్ రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. కాగా, తన తండ్రి 2012లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తనను కలిచి వేసిందని ఆయన 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.

ఎక్సైజ్ ఎస్ఐగా మనోహర్



ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 ఫలితాలలో మనోహర్ ఎక్సైజ్ ఎస్ఐగా అర్హత సాధించారు. బీడీ కార్మికుల కుటుంబంలో జన్మించిన ఆయన ప్రభుత్వ పాఠశాలల్లోనే తన ప్రాథమిక విద్యను కొనసాగించారు. ఆత్మవిశ్వాసంతో పట్టువదలని విక్రమార్కుడిలా విద్యను కొనసాగిస్తూ 2018లో ఎస్‌జీటీ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు.

పేద రైతులకు సేవ చేస్తా..



గట్టు,(ఆంధ్రజ్యోతి): కన్న తల్లితండ్రులతో పాటు తన సోదరుల సహకారం వల్ల నేను గ్రూప్-2లో విజయం సాధించానని బల్గెరకు చెందిన జీ ఆంజనేయులు తెలిపారు. గట్టు మండలం బల్గెర గ్రామానికి చెందిన బోయ తిమ్మప్ప కుమారుడు జీ ఆంజనేయులు గ్రూప్-2లో రాష్ట్ర స్థాయిలో 639వర్యాంకు సాధించి కోఆపరేటివ్ సొసైటీలో అసిస్టెంటు రిజిష్టర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. గ్రూప్- 1లో కొద్ది మార్కులతో మిస్ అయ్యానన్నారు.

న్యూస్ బాక్స్

ఏబీసీ సెంటర్‌కు కుక్కల తరలింపు

జడ్చర్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్లలోని పలు కాలనీల్లో స్వైర విహారం చేస్తున్న కుక్కల పట్టివేత కార్యక్రమాన్ని మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి చేపట్టారు. ఆదివారం 3,4వ వార్డుల్లోని పలు కాలనీల్లో కుక్కలను పట్టుకొని ఏబీసీ సెంటర్‌కు తరలించారు.

ఉత్సాహంగా బాస్కెట్ బాల్ పోటీలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ స్టేడియంలో ఆదివారం 3-3 బాస్కెట్‌బాల్ టోర్నీ నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి బాస్కెట్‌బాల్ క్రీడాకారులను అభినందించారు. స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారుల్లో ఒక్క రోజు పోటీలు నిర్వహించినట్లు కోచ్ ఖలీల్ తెలిపారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, మాజీ కౌన్సిలర్ షేక్‌ఉమర్, ఖాజాపాష, రాశాద్‌ఖాన్, నాయకులు మోసీన్, వాహిద్‌షా పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మిడ్జిల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దగుండ్లతండా గ్రామ పంచాయతీ మర్లాబావితండాకు చెందిన మెగావత్ అనసూయకు మంజూరైన రూ.22 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం కాంగ్రెస్ నాయకులు కుమార్‌నాయక్, రాజు నాయక్ లబ్ధిదారుడు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనునాయక్, రెడ్యా, మున్యా, భాస్కర్, భద్రు నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

మహమ్మదాబాద్ సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎంబీబీఎస్ సీటు సాధించిన నిరుపేద కుటుంబానికి చెందిన హన్వాడ మండలం టంకర గ్రామానికి చెందిన కామారం నవనీతను ఆదివారం మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి రూ.27,800 ఆర్థిక సాయం అందజేశారు. ఎంఈవో జనార్దన్, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాములు, వెంకటయ్య, నాగయ్య, వెంకట్, దస్తయ్య, ఉదయ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మూసాపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చక్రపూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు బాలయ్య అమ్మ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మీనర్సింహాయాదవ్, మండల నాయకులు గూపని కొండయ్య బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సమస్యలకు నిలయం.. న్యూ బాలాజీనగర్

» రోడ్డుకిరువైపులా పెరిగిన కంపచెట్లు » చీకటైతే మందు బాబుల వీరంగం

» రోడ్డు నిర్మాణానికి అడ్డుపడుతున్న పొలం యజమాని



గుంతల రోడ్డులో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలోని న్యూ బాలాజీనగర్ సమస్యలకు నిలయంగా మారింది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కాలనీలో కొన్ని ప్రాంతాల్లోనే సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. కాలనీ చివరన ఉన్న ఇళ్ల వరకు సీసీ నిర్మించలేదు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా జంగిల్ కటింగ్ చేయకపోవడంతో ఇళ్లలోకి పాములు వస్తున్నాయని వాపోతున్నారు. కాలనీకి రోడ్డు నిర్మించడానికి పలుమార్లు నగరపాలక సంస్థ అధికారులు పరిశీలించినప్పటికీ నేటికీ రోడ్డు నిర్మించలేదు. రోడ్డు నిర్మాణానికి స్థానికంగా ఉన్న వ్యవసాయ పొలం యజమాని అడ్డం పడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పట్టా పొలం ఉంటే గతంలో బీటీ నిర్మాణానికి ఎలా అనుమతించారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్థలం యజమానితో నగరపాలక సంస్థ అధికారులు మాట్లాడి రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. దీనికి తోడు రాత్రి వేళ మందుబాబులకు అడ్డాగా మారిందని, పోలీసులు రాత్రి వేళలో గస్తీ నిర్వహించాలని పోలీసు శాఖను మొరపెట్టుకుంటున్నారు.

ఇళ్లలోకి పాములు వస్తున్నాయి..



అపార్ట్‌మెంట్, ఇళ్లలోకి రాత్రి వేళ పాములు వస్తున్నాయి. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరు వైపులా కంపచెట్లను తొలగించడంతో పాటు వెంటనే సీసీ రోడ్డును నిర్మించాలి.

- కాటం రంజిత్‌కుమార్ గౌడ్

రాత్రిళ్లు మందుబాబుల జోరు..



చించోళి బైపాస్ నిర్మాణ పనులు సాగుతుండడంతో పట్టణంలోని పలు ప్రాంతాల ప్రజలు రాత్రి వేళ ఈ రోడ్డు పక్కల మద్యం సేవించడానికి వస్తుంటారు. పోలీసులు దృష్టి సారించి మందుబాబులకు అరికట్టాలి.

- సమరసింహారెడ్డి

రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలి



కాలనీలోని అన్ని ప్రాంతాల్లో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. కానీ కాలనీ చివర ఉన్న ఇళ్ల వరకు రోడ్డు వేయలేదు. దీంతో కాలనీ వాసులకు ఇబ్బందిగా మారింది. వెంటనే అడ్డంకులను తొలగించి రోడ్డు నిర్మించాలి.

- శ్రీధర్ గౌడ్

మహాచండీ దేవిగా అమ్మవారు



మహాచండీ దేవిగా పర్వతాపూర్ అమ్మవారు



శాకాంబరి దేవిగా వాసవీమాత



అన్నపూర్ణా దేవిగా సరస్వతీ మాత



భూత్పూర్ ఆంజనేస్వామి ఆలయ ఆవరణలో అఖండ భజన చేస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/జడ్చర్ల/భూత్పూర్/మహమ్మదాబాద్/దేవరకద్ర/గండీడ్/హన్వాడ/నవాబ్‌పేట/మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శ్రీనివాసకాలనీలోని వాసవీ మాత శాకాంబరి దేవిగా దర్శనమివ్వగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త చెరువు ప్రాంతంలోని రామలింగేశ్వర ఆలయంలో అమ్మవారిని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జడ్చర్ల పట్టణంలోని సాయినగర్‌కాలనీలోని సకలదేవతల ఆలయంలో మహాచండీ దేవీగా అమ్మవారు దర్శనమించారు. వాసవీకన్యకా పరమేశ్వరీ ఆలయంలో దుర్గామాత మధురమీనాక్షిగా దర్శనమివ్వగా, విద్యానగర్‌కాలనీలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో, కావేరమ్మపేటలోని బంగారు మైసమ్మ ఆలయంలో అమ్మవారు మహచండి దేవీగా అవతారంతో భక్తులకు దర్శనమిచ్చింది. భూత్పూర్ మండలం తాటికొండ, అన్నాసాగర్, రావులపల్లి, పోతులమడుగు, వెల్కిచర్ల, పాతమొల్గర గ్రామాలతో పాటు మునిసిపాలిటీలోని గోప్లాపూర్, అమిస్తాపూర్ సరస్వతి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. భూత్పూర్ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించగా, మండలంలోని 11 గ్రామాల నుంచి వచ్చిన భజన భక్తులు అఖండ భజనలు చేసి అమ్మవారి సంకీర్తనలతో అలరింపజేశారు. మహమ్మదాబాద్, దేవరకద్ర, గండీడ్, హన్వాడ, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మహాచండి దేవిగా దర్శనమివ్వగా, మహమ్మదాబాద్‌లో అమ్మవారికి గ్రామస్థులు బోనాలు సమర్పించారు. నవాబ్‌పేట మండలం పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారు మహాచండీదేవిగా దర్శనమిచ్చింది. విశ్వహిందూ పరిషత్ దుర్గావాహిణి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో దుర్గాష్టమి మరియు బతుకమ్మ వేడుకలను విశ్వహిందూ పరిషత్ గణేష్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి దుర్గావాహిణి ప్రాంత సహసంయోజిక మఠం దాక్షాయిని బాలసంస్కార్, సంయోజిక ప్రియాంక దుర్గావాహిని జిల్లా సంయోజిక కుమారి సంధ్య, దుర్గావాహిని మనిషా పూజలు నిర్వహించారు.

పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్ వేయించాలి



కావేరమ్మపేటలో కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ ఆశారాణి

పాలమూరు/భూత్పూర్/జడ్చర్ల/మిడ్జిల్/మూసాపేట/మహమ్మదాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ పెంపుడు, వీధి కుక్కలకు తప్పని సరిగా వ్యాక్సినేషన్ వేయించాలని జిల్లా పశువైద్య, పశుసంరక్షణ అధికారి డాక్టర్ మధుసూదన్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ యాంటి రేబీస్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో, భూత్పూర్ మండల కేంద్రంలోని పశుసంవర్ధశాఖ ఆసు పత్రిలో జంతువులకు ఉచిత యాంటి రేబిస్ వ్యాక్సిన్ వేసి, ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ లూయిస్ ఫాశ్చర్ అనే శాస్త్రవేత్త పిచ్చికుక్క కాటుకు వ్యాక్సిన్ కనుగొన్న రోజు అని, ఆయన వర్ధంతి సందర్భంగా ఈ టీకాతో జంతువుల నుంచి మనుషులకు సోకే అతి ప్రమాదకరమైన రేబీస్ వ్యాధిని నివారించవచ్చు అన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శివానందస్వామి, వెంకటేశ్, నరేష్, డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు. జడ్చర్ల మునిసిపాలిటీ కావేరమ్మపేట పశు వైద్యకేంద్రంలో మండల పశువైద్యాధికారి ఆధ్వర్యంలో కుక్కలకు, పిల్లులకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను వేసారు. 148 కుక్కలకు, 16 పిల్లులకు వ్యాక్సిన్ వేసినట్లు డాక్టర్ ఆశారాణి తెలిపారు. మిడ్జిల్ మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రంలో డాక్టర్ అనుప శివరాజ్ ఆధ్వర్యంలో పెంపు డు కుక్కలకు టీకాలు వేయగా, మార్కెట్ చైర్ పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి పాల్గొన్నారు. మూసాపేట మండల కేంద్రంతో పాటు జానంపేట, వేముల, పోల్కంపల్లి పశువైద్యశాల కేంద్రాల్లో ప్రజలు రాబీస్ బారిన పడకుండా ముందు జాగ్రత్తగా పెంపుడు కుక్కలు, పిల్లులకు అంటి రాబీస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ)ను వేశారు. మహ్మమదాబాద్‌లో మండల పశువైద్యాధికారి నరేందర్‌యాదవ్ 40 కుక్కలకు రేబీస్ నివారణ టీకాలు వేశారు.

కబడ్డీ పోటీలు

జడ్చర్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ 5వ వార్డు నాగసాలలో దసరా పండుగ పురస్కరించుకుని ఆదివారం యువకులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. నాలుగు టీంలు పాల్గొనగా, ప్రథమ, ద్వితీయ విజేతలకు బహుమతులు అందచేశారు. బీఆర్ఎస్ నాయకుడు కొండల్, గ్రామస్థులు శ్రీను, రఘు, విజయ్ పాల్గొన్నారు.

కూలిన ఇంటిని పరిశీలించిన తహసీల్దార్

హన్వాడ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొండ్యాల గ్రామంలోవర్షానికి కూలిన ఇంటిని ఆదివారం తహసీల్దార్ కిష్యానాయక్ పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తానని చెప్పారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ పాల్గొన్నారు.

పార్టీలో సముచిత స్థానం కల్పించాలి

భూత్పూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవం తీసుకరావడానికి పదేళ్లుగా కష్టపడ్డానని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధిష్ఠానం మండలంలో నాయకులు, కార్యకర్తల కష్టాన్ని గుర్తించి అందరికి న్యాయం చేస్తారన్న నమ్మకం ఉందన్నారు. ఎమ్మెల్యే జీఎంఆర్ నిరంతరం ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన వారికి తప్పని సరిగా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

జడ్చర్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పోలేపల్లిసెజ్ నిర్వాసితులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా వారికి కేటాయించిన ఇళ్ల స్థలాలకు సర్వ హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ పోలేపల్లి యువజన సంఘాల నాయకులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 4వ రోజుకు చేరాయి. యువజన సంఘాల నాయకులు రఘునందన్‌చారి, సత్య పాల్గొన్నారు.

మన్‌కీ బాత్ వీక్షించిన బీజేపీ నాయకులు

జడ్చర్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని మండలంలోని కుర్వగడ్డపల్లిలో ఆదివారం బీజేపీ నాయకులు వీక్షించారు. ప్రధానమంత్రి 126వ మన్‌కీ బాత్ కార్యక్రమంతో ఎన్నో విషయాలు తెలుసుకున్నామని బీజేపీ నాయకులు రామకృష్ణ, తిరుపతి, శ్రీనివాస్‌గౌడ్, మహేష్‌యాదవ్, శ్రీనాథ్, గౌరీశంకర్, కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

ఏడాదిలోపు దేవరకద్ర రూపురేఖలు మారుస్తా

» అభివృద్ధిని చూసే కాంగ్రెస్‌లో చేరికలు » ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి



ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

చిన్నచింతకుంట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏడాదిలోపు దేవరకద్ర రూపురేఖలు మారుస్తానని ఎమ్మెల్యే జీ.మధుసూదన్ రెడ్డి అన్నారు. మండలంలోని దమగ్నాపూర్ గ్రామంలోని తన నివాసంలో ఆదివారం దేవరకద్ర మాజీ ఎంపీటీసీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమ్మిగారి వెంకటేష్, బలుసుపల్లి మాజీ సర్పంచ్ సరోజా శంకర్, మాజీ ఉప సర్పంచ్ తిరుపతయ్య, మాజీ వార్డు సభ్యులతో పాటు దాదాపు వందమంది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ఒక కుటుంబం లాంటిదని, ఇక్కడకు వచ్చిన వారందరికీ సమాన అవకాశం ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే డిగ్రీ కళాశాలను మంజూరు చేయటం జరిగిందని, బిల్డింగ్ పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. త్వరలో దేవరకద్ర మునిసిపాలిటీకి రూ.15 కోట్ల నిధులు మంజూరవుతాయని, దేవరకద్ర మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. నియోజకవర్గంలో పైరవీలకు తావులేకుండా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం వడ్డెమాన్‌లో ఎంబీ మిస్సా చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొని, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.5 లక్షల ప్రొసిడింగ్ కాపీని అందజేశారు. గ్రామంలో రెండు హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, నాయకులు వట్టెం శివకుమార్, రంజిత్‌రెడ్డి, గూడూరు శేఖర్, రంజిత్, ఎద్దుల మధుసూదన్‌రెడ్డి, గోవర్ధన్‌యాదవ్ పాల్గొన్నారు.

బీపీ మండల్ మహోన్నతమైన వ్యక్తి



బీపీ మండల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

పాలమూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బిందేశ్వర్ ప్రసాద్ మండల్ మహోన్నతమైన వ్యక్తి అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని గ్రీన్‌బెల్ట్ ఏరియాలో బీపీ మండల్ విగ్రహాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. బీపీ మండల్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రిజర్వేషన్లకు అనుగుణంగా జాతీయ అధ్యక్షుడిగా ఉంటూ ఆనాడు ఏర్పరచినటువంటి 27శాతం రిజర్వేషన్ నేటికీ అమలు కావడం లేదా? ఆ చరిత్రను మనమంతా చెప్పుకోవాలన్నారు. దూర దృష్టితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఇచ్చిన మాటపై తెలంగాణలో రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ నిన్నటి జీవో 9 ప్రకారం ఆర్డినెన్స్ జారీ చేయడం సంతోషం కలిగించిందన్నారు. ఆనాడు మునిసిపల్ కౌన్సిల్ రూ.5 లక్షల నిధులు ఇవ్వటంతో వాటిని యాదవ పెద్దలు ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, శాంతన్న, అల్లి సాయిలు ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసు కోవటం సంతోషంగా ఉందన్నారు. మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, మల్లు నరసింహ రెడ్డి, సిరాజ్‌ఖాద్రి, శ్రీనివాస్‌యాదవ్, పెద్దగొల్ల నరసింహులు, రాములుయాదవ్, మాజీ కౌన్సిలర్స్ పాషా, రాషెద్‌ఖాన్, అంజద్ పాల్గొన్నారు.

తెలంగాణ అద్దె వాహనాల సంఘం ఎన్నిక



ఎంపికైన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అద్దె వాహనదారుల సంఘం కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రఘుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా కరీం, ఉపాధ్యక్షుడిగా ధర్మనాయక్ ఎన్నికయ్యారు. గతంలో జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన ఖాదర్‌పై పలు ఆరోపణలు రావడంతో అధ్యక్ష బాధ్యతల నుంచి తొలగించినట్లు సమావేశంలో తీర్మాణం చేశారు. అబ్దుల్ రహమాన్, నరేష్‌యాదవ్, సూర్యనాయక్, అర్షద్, తిరుపతి, సుధాకర్‌రెడ్డి, రాకేష్, కనకప్ప పాల్గొన్నారు.

పిల్లలు టపాసులు పేల్చారని వ్యక్తి దాడి

జడ్చర్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగ సందర్భంగా పార్కులో పిల్లలు టపాసులు పేల్చారని, కాలనీకి చెందిన ఓ వ్యక్తిపై కొందరు యువకులు దాడి చేసిన సంఘటన జడ్చర్ల లక్ష్మీనగర్‌కాలనీలో చోటుచేసుకుంది. బతుకమ్మ సంబురాలను కాలనీవాసులు జరుపుకుంటున్నారు. ఇదే క్రమంలో కాలనీకి చెందిన చిన్నారులు టపాసులు పేల్చారు. టపాసులు పేల్చుతారా అంటూ ఓ వర్గంకు చెందిన కొందరు యువకులు కాలనీకి చెందిన ఓ వ్యక్తిని చితకబాదారు. మహిళలందరినీ ఓ షటర్‌లో వేసి హంగామా సృష్టించారు. ఈ సంఘటన కాలనీలోని ఓ సీసీ కెమెరాలు రికార్డు అయ్యింది. ఆ వీడియో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. సంఘటనపై కాలనీకి చెందిన మహిళలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు.

మహాకవి గుర్రం జాషువా



గుర్రం జాషువా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

పాలమూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కుల, మత అసమానతలపై అక్షర యుద్ధం చేసి, సామాజిక న్యాయాన్ని సమతా భావాన్ని నిర్మించిన మహాకవి గుర్రం జాషువా చిరస్మరణీయుడని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాణిక్యంరాజు, కుర్మయ్య అన్నారు. ఆదివారం గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించి మాట్లాడారు. నేటికీ గ్రామాల్లో దళితులకు ఆలయ ప్రవేశం లేదన్నారు. జిల్లాలో నేటికీ అనేక గ్రామాలతో సహా అధికారుల దృష్టికి తీసుకొచ్చినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రతీ నెల 30వ తేదీన నిర్వహించాల్సిన సివిల్ రైట్స్‌డే మొక్కుబడిగా సాగుతోందన్నారు. కార్యక్రమంలో వెంకటరాములు, మనోహర్, దస్తప్ప, నాగన్న ఆదివిష్ణువర్ధన్, సురేష్, భాస్కర్, సురేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు. టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బోయపల్లి నరసింహులు, వెంకటస్వామి, మల్ల శివకుమార్, విద్యావతి, కృష్ణ, ఖాదరయ్య, కేశవులు, ఆశన్న, రవికుమార్ ప్రసంగించారు.

ఒక్క అడుగు సేంద్రియం వైపు వేద్దాం



రైతులకు సేంద్రియ ఎరువును అందజేస్తున్న రమేష్‌బాబు

పాలమూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విష రహిత ఆహారం మనిషికి అత్యంత అవసరమని గ్రీన్ ఆర్గానిక్ ఇండియా లిమిటెడ్ సంస్థ ప్రతినిధి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సేంద్రియ రైతుల జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లారు. రైతులు, ప్రజలు ఒక్క అడుగు సేంద్రియం వైపు వేయాలని పిలుపునిచ్చారు. అనవసరపు రసాయన పురుగు మందులు, మోసపూరిత ఎరువులతో బంగారం పండే భూమి నిస్సారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో గో ఆధారిత వ్యవసాయం చేయటం సంతోషంగా ఉందన్నారు. ఎఫ్‌పీవో (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) పేరుతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకుని రైతులు ముందుకు సాగాలన్నారు. అనంతరం ఆర్గానిక్ వ్యవసాయం, సేంద్రియ ఎరువులతో పండించిన పంటలను ఎలా నేరుగా ప్రజలకే ఏ విధంగా అమ్మాలో వివరించారు. అనంతరం సేంద్రియ పద్ధతిలో పంటలు పండించే రైతులు సంఘం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. సేంద్రియ రైతులు ముకుందరెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, వినోద్‌కుమార్, దేవేందర్, అరుణ్, సాకేత్‌రాము, బస్వరాజు, మూర్తి, శాంతాకుమారి, శివకుమార్, చక్రవర్తి, విష్ణువర్ధన్, రాజేందర్‌రెడ్డి, చైతన్య పాల్గొన్నారు.